

పర్యాటకంపై ప్రచారమేది?
కిన్నెరసాని అభయారణ్యంపై ప్రచారం చేపట్టడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 8లో



కరుగుతున్న గుట్టలు
మణుగూరు మండలం సాంబాయిగూడెంలో గల గుట్టలు అక్రమార్కుల మట్టి తవ్వకాలతో కనుమరుగవుతున్నాయి. 8లో

వాతావరణం
గరిష్టం / కనిష్టం 30° / 16°
జిల్లాలో మంగళవారం పగటి ఉష్ణోగ్రతలు ఓ మోస్తరుగా నమోదవుతాయి. తెల్లవారుజామున, రాత్రి వేళ చలి ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

పర్ణశాలలో ట్రయల్ రన్ విజయవంతం



ట్రయల్ రన్‌ను పరిశీలిస్తున్న అధికారులు

దుమ్ముగూడెం : ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాల వద్ద గోదావరిలో గురువారం నిర్వహించే తెప్పోత్సవానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ మేరకు మంగళవారం భద్రాద్రి రామాలయ ఈఓ రమాదేవి, సీఐ అశోక్, ఇరిగేషన్ జేఈ రాజ్‌సుహాస్, ఆర్ఐ నరసింహారావు పర్యవేక్షణలో చేపట్టిన ట్రయల్‌రన్ విజయవంతమైంది. తెప్పోత్సవానికి పర్ణశాల ఆలయానికి వచ్చే భక్తులకు విక్రయించే లడ్డూ ఇతర ప్రసాదాలను సిద్ధం చేశామని ఆలయ ఇన్‌చార్జి అనిల్‌కుమార్ తెలిపారు. భక్తులు గోదావరిలోకి దిగకుండా ఇనుప కంచె ఏర్పాటు చేశామని, ఎనమిది మంది గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచుతున్నామని పేర్కొన్నారు.

హెడ్ కానిస్టేబుల్‌కు ఎస్పీ అభినందన



వీరభద్రంను అభినందిస్తున్న ఎస్పీ, పక్కన అధికారులు

కొత్తగూడెంటౌన్ : రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో ప్రతిభ చాటి మూడు పతకాలు సాధించిన ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ పి.వీరభద్రంను ఎస్పీ రోహిత్‌రాజ్ మంగళవారం అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వీరభద్రం పతకాలు సాధించి జిల్లా పోలీస్ శాఖకు పేరు తేవడం హర్షణీయమని అన్నారు. రాష్ట్రస్థాయిలో రాణించి ఈనెల 31 నుంచి ఫిబ్రవరి 3 వరకు జరగనున్న జాతీయస్థాయి పోటీలకు సైతం ఎంపికయ్యారని, ఇది గర్వించదగిన విషయమని చెప్పారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ సత్యనారాయణ, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఆర్ఐలు సుధాకర్, నర్సింహారావు, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలపై నిర్లక్ష్యం తగదు

సీజీఆర్ఎఫ్ చైర్మన్ వేణుగోపాలాచారి

అశ్వారావుపేటరూరల్: విద్యుత్ సమస్యలపై నిర్లక్ష్యం చేయొద్దని, వినియోగదారులకు సకాలంలో న్యాయం అందించడమే విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక లక్ష్యమని సీజీఆర్ఎఫ్ చైర్మన్ ఎన్.వి.వేణుగోపాలాచారి అన్నారు. మండలంలోని వినాయకపురం సబ్ స్టేషన్ ఆవరణలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. నాణ్యమైన విద్యుత్ అందించడంతో పాటు వినియోగదారుల సమస్యలు సకాలంలో పరిష్కరించేలా కృషి చేస్తున్నామని తెలిపారు. విద్యుత్ సమస్యలు కింది స్థాయిలో పరిష్కారం కాకుంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. అనంతరం వివిధ సమస్యలపై ఎనిమిది మంది వినతులు అందించగా, వాటిని పరిశీలించి త్వరలో పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో టెక్నికల్, ఫైనాన్స్ మెంబర్లు రమేష్, ఆర్.చరణ్‌దాసు, ఇండిపెండెంట్ మెంబర్ ఎం. రామారావు, ట్రాన్స్ కో ఎస్ఈ జి. మహేందర్, డీఈఈ నందయ్య, ఏడీఈ వెంకటరత్నం, ఏఈలు సంతోష్, సాయికిరణ్, రవి, రమేష్ పాల్గొన్నారు.

కళాశాలలో తనిఖీ

దుమ్ముగూడెం : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఇంటర్ బోర్డు డిప్యూటీ కార్యదర్శి యాదగిరి మంగళవారం తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసిన ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ.. తల్లిదండ్రుల ఆకాంక్షలు నెరవేర్చేలా కష్టపడి చదవాలని, జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. అనంతరం కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందితో సమావేశమై పలు విషయాలు చర్చించారు. కార్యక్రమంలో డీఐఈఓ వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీఏ సభ్యుడిగా పాల్వంచ మండల వాసి

పాల్వంచరూరల్ : రీజనల్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ కమిటీ సభ్యుడిగా(నాన్ అఫిషియల్) పాల్వంచ మండలం జగన్నాథపురం పంచాయతీ పరిధిలోని పెద్దమ్మగుడి ప్రాంతానికి చెందిన బాదర్ల జోషి నియమితులయ్యారు. ఈ మేరకు ఆర్టీఏ కమిషనర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, తన నియామకానికి సహకరించిన ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి తదితరులకు జోషి కృతజ్ఞతలు తెలిపారు.



జూ పార్క్ వచ్చేస్తోంది!

'గూడెం'లో పర్యటించిన నిపుణుల బృందం

- ఇల్లెందు క్రాస్ రోడ్డులో స్థలాల పరిశీలన
- 260 ఎకరాల్లో ఏర్పాటుకు ప్రతిపాదనలు
- పర్యాటక రంగానికి మరింత ఊపు..



స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

చుంచుపల్లి: జిల్లా వాసులతో పాటు ఇతర ప్రాంతాల నుంచి ఇక్కడికి వచ్చే పర్యాటకులు, జంతు ప్రేమికుల కోసం త్వరలో జూపార్క్ అందుబాటులోకి రానుంది. అడవులు అత్యధికంగా విస్తరించడమే కాక పర్యాటకంగా, పారిశ్రామికంగా విరాజిల్లుతున్న జిల్లాలో.. జంతు ప్రదర్శనశాల ఏర్పాటుకు సెంట్రల్ జూ అథారిటీ ఆఫ్ ఇండియా ముందుకొచ్చింది. ఈ మేరకు జిల్లా కేంద్రమైన కొత్తగూడెం సమీపంలోని ఇల్లెందు క్రాస్ రోడ్డు వద్ద సువిశాలమైన రెండు అటవీ స్థలాలను జూపార్క్ నిపుణల బృందం సోమవారం పరిశీలించింది. ఇల్లెందు క్రాస్ రోడ్డులో స్థలంతో పాటు సింగరేణి గెస్ట్ హౌస్ పక్కన మరో అటవీ స్థలాన్ని అధికారులు, అటవీ శాఖ సిబ్బంది పరిశీలించారు. ఇక్కడ జంతు ప్రదర్శనశాల ఏర్పాటుకు అవసరమైన వనరులు, అనుకూలతలపై వివరాలు సేకరించారు. జిల్లాలో ఇప్పటికే ఆధ్యాత్మిక, పర్యాటకపరంగా భద్రాచలం, పర్ణశాల, కిన్నెరసాని, పొరుగున ఉన్న పాపికొండలు వంటి ప్రాంతాలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. వీటితో పాటు పారిశ్రామిక ప్రాంతమైన కొత్తగూడెం – పాల్వంచలో జూ పార్క్ ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఎప్పటి నుంచో ఉన్నా.. ఆచరణ సాధ్యం కాలేదు. కిన్నెరసానిలో పర్యాటకులను ఆకట్టుకునేలా జింకల పార్క్‌ను మాత్రం అందుబాటులోకి తెచ్చారు. అయితే జంతు ప్రదర్శనశాల ఏర్పాటుకు ఇక్కడి స్థలాలు, వనరులు అనుకూలంగా ఉన్నాయని, ఈ మేరకు తగిన ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాలని జూపార్క్ నిపుణుల బృందం అటవీ అధికారులకు సూచించింది. కొత్తగూడెం ప్రాంతంలో జూ పార్క్ అందుబాటులోకి వస్తే పర్యాటకంగా మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉందని పలువురు అంటున్నారు.

400 రకాల జంతువులు, పక్షులు..

కొత్తగూడెంలో జూ పార్క్ ఏర్పాటుకు ఇల్లెందు క్రాస్‌రోడ్‌లోని హరిత టూరిజం హోటల్ వెనక భాగంలో 260 ఎకరాలు, సింగరేణి గెస్ట్ హౌస్ పక్కన కార్తీకవనం వెనుక భాగంలో 225 ఎకరాల స్థలాలను నిపుణుల బృందం పరిశీలించింది. జూ పార్కుకు ఈ రెండు స్థలాలు కూడా అత్యంత అనువుగా ఉన్నాయని అధికారులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ రెండింటిలో ఏదో ఒక స్థలానికి మాత్రమే సెంట్రల్ జూ అథారిటీ ఆఫ్ ఇండియా అనుమతులు ఇస్తుంది. జూ పార్క్ ఏర్పాటుకు సంబంధించి నిధులు, జంతువులు, పక్షుల సేకరణ వంటి ప్రతిపాదనలను వెంటనే సిద్ధం చేసి పంపాలని అటవీ అధికారులకు నిపుణుల బృందం సభ్యులు సూచించారు. జూ పార్క్‌లో 400 వరకు జంతువులు, పక్షులను అందుబాటులో ఉంచాలని అధికారులు భావిస్తున్నారు. సామాన్య ప్రజలు, పర్యాటకులకు వన సంరక్షణపై అవగాహన కల్పించేందుకు జంతు ప్రదర్శనశాలలు దోహదపడుతుంటాయి. అటవీ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న జూ పార్క్‌లో వివిధ రకాల జంతువులతో పాటు వివిధ జాతుల మొక్కలను కూడా పెంచుతారు. రెండు రాష్ట్రాల్లో ఇప్పటి వరకు హైదరాబాద్, విశాఖపట్టణం, తిరుపతి, హనుమకొండ నగరాల్లో మాత్రమే ఉన్నాయి. ఇక్కడ ప్రధానంగా చిరుత, జింకలు, నల్ల హంస, కొండగొర్రె, లేళ్లు, దుప్పులు, కోతులు, మనుబోతు, ఎలుగుబంట్లు, నక్కలు, అడవి పిల్లి తదితర జంతువులతో పాటు చిలుకలు, పావురాలు, కనుజులు, నిప్పుకోళ్లు, నెమళ్ల వంటి పలు రకాల పక్షులు, తాబేళ్లు, మొసళ్ల వంటి సరీసృపాలను సంరక్షిస్తున్నారు. త్వరలో జిల్లాలో ఏర్పాటు చేయనున్న జూ పార్క్‌లోనూ ఆయా జంతువులు, పక్షులను సేకరించనున్నారు. నిత్యం 500 మంది పర్యాటకులు తిలకించేందుకు వీలుగా వసతులు సమకూర్చుతారు. అన్ని అనుమతులు లభిస్తే కొత్తగూడెంలో ఏడాదిన్నరలోపు జూపార్క్‌ను అందుబాటులోకి తేవాలని అటవీశాఖ అధికారులు భావిస్తున్నారు.

స్థలాలు పరిశీలించాం



కొత్తగూడెంలో జూ పార్క్ ఏర్పాటుకు నిపుణుల బృందం రెండు స్థలాలను పరిశీలించింది. స్థలాలు, జూ పార్క్ ఏర్పాటుకు అనుకూలతల విషయంలో అధికారులు సంతృప్తి వ్యక్తం చేశారు. దీనిపై ప్రతిపాదనలను సిద్ధం చేసి త్వరలో సెంట్రల్ జూ అథారిటీ ఆఫ్ ఇండియాకు పంపుతాం. అనుమతులు లభిస్తే ఏడాదిన్నర కాలంలో జూపార్క్ అందుబాటులోకి వస్తుంది.

– కిష్టాగౌడ్, డీఎఫ్ఓ, కొత్తగూడెం

సుందర రూపం.. బలరామావతారం



స్వామి వారి దర్శనానికి బారులుదీరిన భక్తులు

నేడు వైభవంగా ఊంజల్ సేవ



బలరామావతారంలో దర్శనమిస్తున్న స్వామి వారు

భద్రాచలం : శేష తల్పమున సేద తీరి రెండు చేతుల్లో శంఖు చక్రాలు, మరో రెండు చేతుల్లో నాగలి, గదతో దర్శనమిచ్చిన బలరామావతారం బహు సుందరమని కొనియాడుతూ భక్తులు జేజేలు పలికారు. శ్రీహరికి శయన అయిన ఆదిశేషుని అంశతో జన్మించి, శ్రీకృష్ణునికి అన్నగా ఆయనకు ధర్మస్థాపనలో సహకరిస్తూ, అపర పరాక్రముడిగా పేరొందిన బలరాముడి అవతారంలో స్వామివారు దర్శనమిచ్చారు. పగల్‌పత్తు ఉత్సవాల్లో భాగంగా భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి మంగళవారం ఈ రూపంలో అలంకరించారు. తెల్లవారుజామున ప్రత్యేక పూజలు, సుప్రభాతం, ఆరాధన తదితర సేవలు జరిపించారు. బలరామావతారంలో అలంకరించిన స్వామివారిని భక్తుల సందర్శనార్థం కాసేపు బేడా మండపంలో వేంచేపు చేశారు. అనంతరం బాజాభజంత్రీలు, కోలాటాల నడుమ మిథిలా స్టేడియంలోని వేదికపైకి తీసుకొచ్చి కొలువుదీర్చారు. అర్చకులు స్వామి వారికి నైవేద్యం, హారతి సమర్పించాక, భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. తిరువీధి సేవ అనంతరం స్వామివారిని తిరిగి ఆలయానికి తీసుకొచ్చారు.

నేడు కృష్ణావతారంలో దర్శనం..

అధ్యయనోత్సవాల్లో భాగంగా భద్రాద్రి రామయ్య శనివారం శ్రీకృష్ణావతారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. దేవకీ వసుదేవులకు అష్టమ సంతానంగా జన్మించి, దుష్టులైన కంసుడు, నరకాసురుడు, శిశుపాలుడు మొదలైన వారిని వధించి, ధర్మవర్తనులైన పాండవుల పక్షం వహించి, కురుక్షేత్ర సంగ్రామంలో ఉపనిషత్తుల సారాంశమైన భగవద్గీతను అర్జునుడికి బోధించి మానవ ఆదర్శాలను, ధర్మాన్ని స్థాపించిన శ్రీమన్నారాయణుని పరిపూర్ణ అవతారం శ్రీకృష్ణావతారం. చంద్ర గ్రహ బాధలున్నవారు ఈ అవతారాన్ని దర్శించడం వలన శుభ ఫలితాలు పొందుతారని ప్రతీతి. ఈ సందర్భంగా బేడా మండపంలో కృష్ణావతారంలో ఉన్న స్వామివారికి వైభవంగా ఊంజల్ సేవ నిర్వహించనున్నారు.

రేపు జాబ్‌మేళా

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన శాఖాధికారి కొండపల్లి శ్రీరామ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేఎల్ఆర్ గ్రూప్‌లో ప్యాకింగ్, లోడింగ్, అన్ లోడింగ్ పనుల నిర్వహణకు ఎస్సెస్సీ, ఇంటర్ చదివిన 18 – 35 సంవత్సరాల వయసు గల నిరుద్యోగులకు అవకాశం కల్పిస్తున్నామని, అభ్యర్థులు ధ్రువీకరణ పత్రాలతో ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు.

సంక్రాంతికి ఆర్టీసీ రెడీ

- ఖమ్మం రీజియన్ నుంచి 1,030 బస్సుల రాకపోకలు
- ఏడు డిపోల నుంచి ప్రత్యేక సర్వీసులు
- ఈనెల 9 నుంచి 19 వరకు అందుబాటులో..
- రద్దీకి అనుగుణంగా సంఖ్య పెంచేలా ఏర్పాట్లు



ఖమ్మంమయూరిసెంటర్: సంక్రాంతి పండుగకు ఆర్టీసీ సిద్ధమైంది. పండుగకు స్వస్థలాలకు వచ్చి వెళ్లే వారి కోసం ప్రత్యేక బస్సులు నడిపించేలా ప్రణాళిక రూపొందించింది. ఖమ్మం రీజియన్‌లో ఏడు డిపోల నుంచి 1,030 బస్సులు నడవనున్నారు. గత అనుభవాల ఆధారంగా ఈ సంక్రాంతికి ముందుగానే ప్రత్యేక సర్వీసులు మొదలుపెట్టాలని అధికారులు నిర్ణయించారు. ఈనెల 9 నుంచి 19వ తేదీ వరకు ప్రత్యేక సర్వీసులు అందుబాటులో ఉంటాయి. కాగా, అవసరమైతే 20వ తేదీన కూడా ఈ సర్వీసులు కొనసాగిస్తారు. అయితే, అదనపు సర్వీసుల్లో సాధారణ బస్సులతో పోలిస్తే చార్జీలు పెంచాలని సంస్థ నిర్ణయించినట్లు తెలిసింది.

రద్దీకి అనుగుణంగా..

విద్య, ఉద్యోగ, వ్యాపారాల నిమిత్తం వివిధ ప్రాంతాల్లో ఉండేవారు సంక్రాంతికి స్వస్థలాలకు రావడం ఆనవాయితీ. ఈనేపథ్యాన రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ ఖమ్మం రీజియన్ అధికారులు ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేస్తున్నారు. హైదరాబాద్ నుంచి ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని వివిధ ప్రాంతాలకు వచ్చే ప్రయాణికుల కోసం ఈనెల 9 నుండి 14వ తేదీ వరకు 585 బస్సులు నడిపించనున్నారు. అలాగే, తిరుగు ప్రయాణంలో ఈనెల 15 నుంచి 19వరకు ఉమ్మడి జిల్లా నుంచి హైదరాబాద్‌కు 445 బస్సులు నడిపిస్తారు. ఇందులో రీజియన్ పరిధిలోని బస్సులతో పాటు సిటీ సర్వీసులు కూడా ఉంటాయి. ఇక పండుగ రోజులైన 11, 12వ తేదీల్లో వీటికి తోడు మరో 135 బస్సులు తిప్పుతారు. అలాగే, రద్దీ ఎక్కువగా ఉంటే అప్పటికప్పుడు అదనపు బస్సులు ఏర్పాటుచేసేలా ప్రణాళిక రూపొందించారు.

రిజర్వేషన్ సౌకర్యం కూడా..

సంక్రాంతి పండుగకు ఆర్టీసీ నడిపే అదనపు బస్సుల్లో రిజర్వేషన్ సౌకర్యం కల్పించారు. సొంత ఊర్లకు వెళ్లివచ్చే వారు www. tgsrtcbus. in వెబ్‌సైట్ ద్వారా సీట్లు రిజర్వేషన్ చేసుకోవచ్చు. అలాగే, సమీపంలోని బస్టాండ్లలో కూడా సీట్లు రిజర్వేషన్ చేసుకునే వెసలుబాటు కల్పించారు. అయితే, రిజర్వేషన్‌తో పాటు రిజర్వేషన్ లేకుండా కూడా బస్సులు ఉంటాయని అధికారులు తెలిపారు.

బస్సు సర్వీసుల కోసం సంప్రదించాల్సిన నెంబర్లు...

డిపో	సెల్ నంబర్
ఖమ్మం కొత్త బస్టాండ్	99592 25979
ఖమ్మం పాత బస్టాండ్	99592 25965
సత్తుపల్లి	99592 25990
మణుగూరు	89853 61796
కొత్తగూడెం	99592 25982
మధిర	73829 25289
భద్రాచలం	99592 25987

హైదరాబాద్ నుండి ఖమ్మం రీజియన్‌కు నడిపించే ప్రత్యేక బస్సుల సంఖ్య		రీజియన్ నుండి హైదరాబాద్‌కు నడిపే బస్సుల సంఖ్య	
తేదీ	బస్సులు	తేదీ	బస్సులు
9	40	15	125
10	130	16	120
11	135	17	80
12	135	18	60
13	100	19	60
14	45		

ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా..



హైదరాబాద్ నుంచి ఖమ్మం రీజియన్‌కు, మళ్లీ హైదరాబాద్‌కు ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంటుందనే భావనతో నాన్‌స్టాప్ సర్వీసులు ఏర్పాటు చేస్తున్నాం. ఖమ్మం నుంచి మణుగూరు, భద్రాచలం, సత్తుపల్లి, కొత్తగూడెం, మధిర, ఇల్లెందు తదితర ప్రాంతాలకు బస్సులు నిరంతరం అందుబాటులో ఉంటాయి. ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడమే మా లక్ష్యం. ప్రజలు కూడా ప్రైవేట్ వాహనాల్లో కాకుండా ఆర్టీసీలో ప్రయాణించాలి.

– ఏ.సరిరామ్, ఖమ్మం రీజినల్ మేనేజర్

ఆదివాసీ సంస్కృతి ప్రతిబింబించాలి

- కనకగిరి గుట్టలకు 11న పలువురు పర్యాటకులు..
- ఏర్పాట్లు అద్భుతంగా ఉండాలి
- కలెక్టర్ జితేష్ వి పాటిల్

చంద్రుగొండ : దేశం నలుమూలల నుంచి పలువురు ప్రముఖులు ఈనెల 11న కనకగిరి గుట్టలను సందర్శించనున్నారని, ఆదివాసీ సంస్కృతి ప్రతిబింబించేలా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. మండలంలోని బెండాలపాడు శివారులో గల కనకగిరి గుట్టలను మంగళవారం ఆయన సందర్శించారు. ఇటీవల తయారు చేసిన వెదురు ఉత్పత్తులను పరిశీలించారు. పర్యాటకులు ఆశ్చర్యపోయేలా ఏర్పాట్లు ఉండాలని, చారిత్రక ప్రాంతమని చూడగానే అర్థమయ్యేలా నేమ్ బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఆదివాసీ సంప్రదాయ వంటకాలను రుచి చూశారు. బేస్ క్యాంప్ షెడ్‌ను పరిశీలించారు. పర్యాటకుల సందర్శన నేపథ్యంలో వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా స్థానిక ఆదివాసీలే మార్గదర్శకత్వం వహించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సంధ్యారాణి, ఎంపీడీఓ బయ్యారపు అశోక్, బ్యాంబో క్లస్టర్ డైరెక్టర్లు ఈసం నాగభూషణం, మల్లం కృష్ణయ్య, నాయకులు భోజ్యానాయక్, ఎస్కే ఫజల్, వీసం రాములు, బొర్రా లలిత పాల్గొన్నారు.



ఆదివాసీల వంటకాలను పరిశీలిస్తున్న కలెక్టర్ పాటిల్

'భూమాత' సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి..

సూపర్‌బజార్(కొత్తగూడెం): భూమాత పోర్టల్ అమలుకు ముందు మాడ్యూల్‌లో తలెత్తే సమస్యలను గుర్తించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పాటిల్ అన్నారు. అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్‌తో కలిసి మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భూమాత మాడ్యూల్ పోర్టల్‌లో తలెత్తే సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలను తహసీల్దార్లు లిఖితపూర్వకంగా నిర్దేశిత పట్టిక ద్వారా తెలియజేయాలని ఆదేశించారు. జిల్లాలో ఎక్కువగా ఉన్న భూ సమస్యలను గుర్తించి పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. ఆర్ఓఆర్ చట్టం, కొత్త చట్టంపై అవగాహన ఉండాలన్నారు.



భద్రాచలంలో ముక్కోటి ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, అధికారులు

జిల్లా చరిత్ర తెలిపేందుకే రివర్ ఫెస్టివల్

భద్రాచలంటౌన్: ముక్కోటికి భద్రాద్రికి వచ్చే భక్తులు, పర్యాటకులను కనువిందు చేయడంతో పాటు జిల్లా చరిత్ర తెలిపేందుకే ఏరు(రివర్)ఫెస్టివల్ నిర్వహిస్తున్నామని కలెక్టర్ అన్నారు. మంగళవారం ఆయన భద్రాచలంలో పలు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దక్షిణ అయోధ్యగా పేరొందిన భద్రాచలం చరిత్రను ఖండాంతరాలకు వ్యాపించేలా తెప్పోత్సవం, ఉత్తర ద్వార దర్శనం వేడుకలను వైభవంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఈనెల 8, 9, 10 తేదీల్లో గిరిజన విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఆర్డీఓ దామోదర్ రావు, అధికారులు రాంప్రసాద్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, రమణయ్య, హరికృష్ణ పాల్గొన్నారు.

అభివృద్ధి కోసమే కార్పొరేషన్

- అపోహలొద్దు.. గిరిజన చట్టాలకు ఆటంకం ఉండదు
- ఎమ్మెల్యే కూనంనేని

సూపర్‌బజార్(కొత్తగూడెం): కొత్తగూడెం నియోజకవర్గ అభివృద్ధికి కార్పొరేషన్ దోహదం చేస్తుందని, ఇందుకోసం శక్తి వంచన లేకుండా కృషి చేసి సాధించానని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. కార్పొరేషన్ ఏర్పాటుతో నష్టమనే ప్రచారంలో వాస్తవం లేదని చెప్పారు. లక్ష్మీదేవిపల్లి మండలంలోని టూరిజం హోటల్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కార్పొరేషన్ ఏర్పాటుతో ప్రజల ఆస్తుల విలువలు పెరుగుతాయని, జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని అన్నారు. ఇప్పటికే పారిశ్రామికంగా అభివృద్ధి సాధిస్తున్న కొత్తగూడెంలో నూతన పరిశ్రమల ఏర్పాటుకు మార్గం సుగమం అవుతుందని చెప్పారు. పారిశ్రామికాభివృద్ధిలో రాష్ట్రంలోనే జిల్లా ద్వితీయ స్థానంలో ఉందన్నారు. సుదీర్ఘకాలంగా ఎన్నికలు జరగని పాల్వంచ మున్సిపాలిటీకి కూడా ఇప్పుడు మార్గం సుగమం అవుతుందని తెలిపారు. కార్పొరేషన్ ఏర్పాటుతో అధికంగా నిధులు మంజూరవుతాయని, తద్వారా అభివృద్ధితో పాటు ఉద్యోగవకాశాలు కూడా పెరుగుతాయని చెప్పారు. గిరిజనులకు, గిరిజన చట్టాలకు, రిజర్వేషన్లకు, గిరిజనుల ఆస్తులకు ఎలాంటి నష్టం ఉండదని స్పష్టం చేశారు. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్ పూర్తిగా గిరిజన రాష్ట్రాలని, అయినా అక్కడ కార్పొరేషన్ విధానం అమల్లో ఉందని వివరించారు. పన్నులు పెరుగుతాయని, ఉపాధిహామీ పథకంలో గిరిజనులకు అన్యాయం జరుగుతుందనే ప్రచారంలో వాస్తవం లేదన్నారు. ఎలాంటి మార్పులు లేకుండా కార్పొరేషన్ పాలనా విధానం మాత్రమే కొనసాగుతుందని తెలిపారు. ఉద్యోగులకు హెచ్ఆర్ఏ పెరుగుతుందన్నారు. నియోజకవర్గానికి మరో వరంగా రామవరం – గరీబ్‌పేట ప్రాంతంలో విమానాశ్రయం ఏర్పాటుకు అవసరమైన సర్వేకు ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం రూ.38 లక్షలు మంజూరు చేసిందని చెప్పారు. ఈఎస్ఐ ఆస్పత్రి, నూతన బొగ్గు గనులు, ఐటీ హబ్, క్రీడా మైదానాలు, ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు వివరించారు. కార్పొరేషన్ ఏర్పాటుకు సహకరించిన సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబిర్‌పాషా, నాయకులు చంద్రగిరి శ్రీనివాసరావు, రాజ్‌కుమార్, కంచర్ల జమలయ్య, వాసిరెడ్డి మురళి, వంగా వెంకట్, కాంగ్రెస్ నాయకులు కంచర్ల చంద్రశేఖర్‌రావు, నాగ సీతారాములు, ఆళ్ల మురళి, యర్రంశెట్టి ముత్తయ్య, దేవీప్రసన్న పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కూనంనేని, పక్కన నాయకులు

క్లుప్తంగా

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



శ్రీరామ్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే ఆదినారాయణ

దమ్మపేట: మండలంలోని గండుగులపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి పాయం జోగేంద్ర శ్రీరామ్ జాతీయ స్థాయి ఖో–ఖో పోటీలకు ఎంపిక య్యాడు. ఈ నెల 10 నుంచి 13 వరకు మహా రాష్ట్రలోని కొల్హాపూర్‌లో జరిగే జాతీయస్థాయి ఖో–ఖో పోటీలకు తెలంగాణ జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నాడు. ఈ సందర్భం గా గండుగులపల్లి క్యాంపు కార్యాలయంలో విద్యార్థిని స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారా యణ అభినందించారు. కార్యక్రమంలో హెచ్ఎం మస్తాన్‌వలీ, నాయకులు కాసాని నాగప్ర సాద్, తుమ్మల శేషుబాబు, జూపల్లి ఉపేంద్ర, ఎర్రా వసంతరావు, మడకం రాజేశ్, సున్నం రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

- ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్

భద్రాచలంఅర్బన్: భద్రాచలంలో ఈనెల 9, 10 తేదీల్లో జరిగే తెప్పోత్సవం, ఉత్తర ద్వార దర్శ నానికి వచ్చే భక్తులు ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలని ఏఎస్పీ విక్రాంత్‌కుమార్ సింగ్ సూచించారు. వారికి కేటాయించిన ప్రదేశాల్లోనే వాహనాలు పార్కింగ్ చేయాలని కోరారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సారపాక వైపు నుంచి వచ్చే ఫోర్ వీలర్స్ బ్రిడ్జి పాయింట్‌లోని అయ్యప్పస్వామి ఆలయం, ఆర్‌అండ్‌బీ వసతి గృహం వద్ద, కూన వరం వైపు నుంచి వచ్చే వాహనాలు శ్రీ విద్యా పాఠశాల వద్ద గల ఖాళీ స్థలంలో, చర్ల వైపు నుం చి వచ్చే వాహనాలు అంబేద్కర్ సెంటర్‌లోని మార్కెట్ కమిటీ స్థలంలో పార్కింగ్ చేయాలని సూచించారు. వీవీఐపీ, వీఐపీ పాసులు ఉన్న వాహనాలు మాత్రం దేవస్థానం సమీపంలోని కాపా రామలక్ష్మమ్మ పార్కింగ్ స్థలంలో నిలపా లని పేర్కొన్నారు. ఇతర అన్ని వాహనాలూ చర్ల రోడ్డులోని మార్కెట్ కమిటీ స్థలంలో పార్కింగ్ చేయాలని, ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ప్రకటించారు.

కోర్టు ఉత్తర్వులు పాటించాలి

సుజాతనగర్: నిందితులు కోర్టు ఉత్తర్వులను తప్పక పాటించాలని ఎస్సై ఎం.రమాదేవి అన్నారు. స్టేషన్ పరిధిలోని పాత కేసుల్లో ఇద్దరు నిందితులు కోర్టు విచారణకు గైర్హాజరు కావడంతో నాన్ బెయిలబుల్ వారెంట్‌తో మం గళవారం వారిని భద్రాచలం సబ్ జైలుకు తర లించినట్లు చెప్పారు. మంగపేట గ్రామానికి చెందిన గుగులోత్ అరుణ, ఒడ్డుగూడెం తం డాకు చెందిన భూక్యా అరుణ్‌పై వేర్వేరు ఘటనల్లో కేసు నమోదైందని, వారు కోర్టు ఉత్త ర్వులను లెక్కచేయకుండా, వాయిదాలకు గైర్హా జరయ్యారని తెలిపారు.

కందకాలు తవ్వించిన అధికారులు

బూర్గంపాడు: ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. మండలంలోని సోంపల్లి, బుడ్డగూడెం, ఉప్పు సాక గ్రామాల్లో కిన్నెరసాని నుంచి ఇసుక అక్రమ రవాణా చేస్తున్న రహదారులకు కందకా లు తవి ్వంచారు. రెవెన్యూ, మైనింగ్, పోలీస్‌శాఖల అధి కారులు సంయుక్తంగా ఇసుక అక్రమ రవాణా మార్గాల్లో లోతైన కందకాలు తవ్వించా రు. కార్య క్రమాల్లో మైనింగ్ ఏడీ దినేశ్, మైనింగ్ ఆర్ఐ పరుశురాములు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నర్సింహా రావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని అశోక్‌నగర్‌కాల నీలోని తాళం వేసి ఉన్న ఓ ఇంట్లో మంగళవారం చోరీ జరిగింది. వివరాలిలా ఉన్నాయి.. కాల నీలో సారథి రమేశ్, వాణి దంపతులు నివాసం ఉంటున్నారు. రమేశ్ ఒడిశాలో వ్యాపారం చేస్తున్నాడు. వాణి ఇంటి వద్దే ఉంటోంది. కాగా, శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో ప్రస్తుతం అధ్యయనోత్సవాలు జరుగుతుండగా రోజూ వాణి.. ఇంటి పక్కన ఉండే మహిళలతో కలిసి దేవాలయానికి వెళ్తోంది. మంగళవారం కూడా అలాగే వెళ్లగా.. ఇంటి పక్కనే ఉన్న మరో మహిళ వాణిని తీసుకెళ్లేందుకు ఫోన్ చేయగా ఎత్తకపోవడంతో ఇంటి వద్దకు వచ్చింది. ఇంటి లోపలి నుంచి శబ్దాలు రావడం గమనించి కిటికి లోనుంచి చూడగా ఓ వ్యక్తి వస్తువులను పడేస్తు న్నాడు. వెంటనే ఆమె వాణికి ఫోన్ చేయడంతో ఆమె వచ్చి పరిశీలించి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ విజయలక్ష్మి, సిబ్బంది, క్లూస్ టీంతో వచ్చి వివరాలు సేకరించారు. కాగా, దుండగుడు ఇంట్లోకి వెళ్లి, వచ్చే దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. బీరువాలో ఉండా ల్సిన రూ.1.50 లక్షల నగదుతో పాటు 4 బం గారపు ఉంగరాలు కనిపించడం లేదని బాధి తురాలు వాణి తెలిపింది. ఇప్పటివరకు ఈ ఘట నకు సంబంధించి బాధితుల నుంచి ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

ములకలపల్లి: మండలంలోని తిమ్మంపేట శివా రులో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీ సులు మంగళవారం దాడి చేశారు. ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.4,700 నగదు, రెండు బైక్‌లు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ రాజశేఖర్ వెల్లడించారు.

పర్యాటకంపై ప్రచారమేది?



పాల్వంచ నుంచి కిన్నెరసానికి వెళ్లే ప్రధాన రహదారి

- గతంలో బస్టాండ్, కేఎస్‌పీ రోడ్లలో కిన్నెరసాని అభయారణ్య హోర్డింగ్‌లు
- ప్రాజెక్ట్‌కు వచ్చే వారికి రోడ్డు మార్గం చూపిస్తూ బోర్డులు
- ఆ తర్వాత బోర్డులు మాయం.. కానరాని ప్రచారం

పాల్వంచ: కిన్నెరసాని అభయారణ్యం ప్రాము ఖ్యత, అక్కడికి వెళ్లేందుకు మార్గంపై గతంలో హోర్డింగ్‌లు, బోర్డులు ఏర్పాటు చేసి ప్రచారం చేసే వారు. భద్రాచలం రాములవారిని దర్శించుకునే భక్తులు అధిక సంఖ్యలో పాల్వంచ మండలంలోని ఈ కిన్నెరసాని అభయారణ్యాన్ని కూడా చూసి వెళ్తుంటారు. అయితే, పర్యాటకానికి కావాల్సినంత ప్రచారం జరగడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. గతంలో ఖమ్మం జిల్లా కేంద్రంలో, కొత్తగూడెంలో, పాల్వంచలో పలుచోట్ల హోర్డింగ్‌లు కనిపించేవి. పాల్వంచకు 12 కిలో మీటర్ల దూరంలో ఉన్న కిన్నెర సానికి దారి పొడవునా అధికారులు బోర్డులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ఒక్క బస్టాండ్‌కే బోర్డు పరిమితం

కిన్నెరసానికి దూర ప్రాంతాల నుంచి వచ్చేవారి సం ఖ్య అధికం. వారి కోసం బోర్డులు ఏర్పాటు చేయా ల్సిన ఆవశ్యకత ఉంది. ఒక్క బస్టాండ్‌లో మాత్రమే ఒక హోర్డింగ్‌ను ఏర్పాటు చేశారు. ప్రధాన కూడళ్లు, కిన్నెరసానికి వెళ్లే దారిలో అల్లూరి సెంటర్ వద్ద ఒక బోర్డు, దారి పొడవునా పలు చోట్ల బోర్డులు ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకోవాలని పలు వురు కోరుతున్నారు.

అభయారణ్యంగా ప్రసిద్ధి

ఈ ప్రాజెక్ట్ అభయారణ్య కేంద్రంగా ప్రసిద్ధి. ఇదంతా అటవీశాఖ ఆధీనంలో ఉంది. పిల్లల నుంచి పెద్దల వరకు కలిసి సమయం గడిపేలా పచ్చని అందాలు కనిపిస్తాయి. పర్యాటకంతో వచ్చే రాబడితో అటవీ శాఖ ఖమ్మం, కొత్తగూడెం, పాల్వంచ, భద్రా చలం పట్టణాల్లో కిన్నెరసాని పర్యాటక ప్రాముఖ్యతను చాటి చెప్పేలా హోర్డింగ్‌లు, బోర్డులు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

విద్యుత్ కాంతులు అందిస్తున్న ప్రాజెక్ట్

ఒక్క పర్యాటకాభివృద్ధికే కాకుండా టీఎస్‌జెన్‌కో పరిధిలో నడుస్తున్న కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేష న్‌లైన 5, 6, 7 దశల కర్మాగారల్లో 1800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి ప్రధాన నీటి వనరు ఈ ప్రాజెక్టే. ప్రస్తుతం ఈ ప్రాజెక్ట్ టీఎస్ జెన్‌కో పరిధిలోనే ఉం ది. కొత్తగూడెం, పాల్వంచ పట్టణాలు, పలు గ్రామాల్లోని సుమారు 3 లక్షల మందికి తాగునీటి వనరు కావడం విశేషం. ఎన్ఎండీసీ, నవభారత్ వంటి కర్మాగారాలకు కావాల్సిన నీటి వసతి కల్పి స్తోంది. కుడి, ఎడమ కాల్వల ద్వారా దిగువ భాగాన సాగునీరు అందిస్తోంది. పలు సినిమా షూటింగ్‌లు ఇక్కడ జరుపుకున్నాయి.

కిన్నెరసానికి ఎంతో పేరుంది



ఉమ్మడి రాష్ట్రంలోనే కిన్నెరసాని పర్యాటకానికి ఎంతో పేరుం ది. రోజువారీగా అనేక ప్రాం తాల నుంచి పర్యాటకులు వచ్చి వెళ్తుంటారు. ఎన్నో ప్రకృ తి అందాలకు పెట్టింది పేరు. ఈ ప్రాజెక్ట్‌పై ఆధా రపడి కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్, కొత్తగూ డెం, పాల్వంచ పట్టణాల ప్రజలకు తాగునీరు, కుడి, ఎడమ కాల్వల ద్వారా వ్యవసాయానికి సాగునీరు అందుతోంది.

–టి.వెంకటరమణ సూరి, స్థానికుడు

ప్రచార లోపం..



కిన్నెరసాని పర్యాటకానికి ప్రచార లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. గతంలో ఖమ్మం కేంద్రంగా కూడా అనేక చోట్ల హోర్డింగ్‌లు ఉండేవి. ఇక పాల్వంచలో బస్టాండ్‌లో మినహా ఎక్కడా పర్యా టక ఆశక్యతను తెలిపే హోర్డింగ్‌లు లేవు. ఇప్పటికై నా అధికారులు జిల్లా పర్యాటకంలో ప్రత్యేకత కలి గిన కిన్నెరసానికి మరింత ప్రాధాన్యత కల్పిం చాలని కోరుతున్నాం.

– కల్యాణ్‌రామ్, స్థానికుడు

బోర్డుల ఏర్పాటుపై దృష్టి..

పర్యాటకానికి మరింత పేరు వచ్చేలా తప్పక కృషి చేస్తాం. బడ్జెట్ చూసుకుని అక్కడక్కడా బోర్డులు, ఇతర ప్రచారంపై దృష్టి సారిస్తాం. కొత్తగా ఏవిధం గా చేస్తే బాగుంటుందో కూడా పరిశీలిస్తాం. రానున్న రోజుల్లో పర్యాటకానికి మరింత శోభ తెచ్చే విధంగా చర్యలు తీసుకుంటాం.

– బాబు, వైల్డ్ లైఫ్ డీఎఫ్ఓ, పాల్వంచ

కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీల ధర్నా




శిబిరం వద్ద ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే సాంబశివరావు

సూపర్‌బజార్(కొత్తగూడెం): అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతనంగా రూ.18 వేలు ఇస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట మంగళవారం సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అంగన్ వాడీ టీచర్లు, హెల్పర్లు నిర్వహించిన ధర్నాకు ఆయన మద్దతు పలికి మాట్లాడారు. అంగన్‌వాడీ కేం ద్రాల బలోపేతానికి అధిక నిధులు కేటాయించాల ని, పక్కాభవనాలు నిర్మించి విద్యుత్, మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. ఇంటి అద్దెలు, గ్యాస్ బిల్లులు, పెండింగ్ బిల్లులు, మినీ టీచర్లకు ఉద్యోగోన్నతి కల్పించాలని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ఐసీడీఎస్‌కు నిధులు పెం చాలని, ఖాళీగా ఉన్న ఆయా, టీచర్ల పోస్టులను భర్తీ చేయాలని, ఎన్నికల విధులను రద్దు చేయాలని పేర్కొన్నారు. సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు. ధర్నా వద్దకు సంక్షేమాధికారి స్వర్ణలతలెనీనా వచ్చి సమస్య లను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామని చెప్పారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరాటి ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు కంచర్ల జమలయ్య, అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గోనె మణి, రెడ్డి అరుణ, నాయకులు భూక్య లలిత, వేల్పుల మల్లికార్జున్, అన్నారపు వెం కటేశ్వర్లు, ఇట్టి వెంకట్రావు, నిమ్మల రాంబాబు, విజయ, వినోద, శ్రీలత, సరోజ పాల్గొన్నారు.

కనుమరుగవుతున్న గుట్టలు

- అడ్డు, అదుపు లేకుండా గ్రావెల్ రవాణా
- లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి మాయం
- గుట్టలు తొలిచేస్తున్నా పట్టించుకోని అధికారులు



పేరంటాల చెరువును ఆనుకుని ఉన్న గుట్ట వద్ద తవ్వకాలు

మణుగూరుటౌన్: మండలంలోని సాంబాయి గూడెం పంచాయతీలోని గుట్టలు కొందరు అక్రమా ర్కుల చేతిలో కనుమరుగైపోతున్నాయి. ఏడాది పొడుగునా నిండు కుండలా దర్శనమిస్తూ ఆహ్లాదం పంచే పేరంటాల చెరువుకు ఆనుకుని ఉన్న ప్రకృతి సహజ సంపదకు సజీవ సాక్షాలుగా మిగిలిన గుట్టలు కళ్లముందే కరిగిపోతున్నాయి. దశాబ్దాల కాలం నాటి చెరువు భవిష్యత్ అనుమతి లేని గ్రావెల్ రవాణాతో ప్రశ్నార్థకంగా మారుతున్నా అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడకపో వడం పలు అనుమానాలకు తావిస్తోంది. విరామం , విసుగు లేకుండా వందలాది లారీల్లో 24 గంట లూ లక్షల క్యూబిక్ మీటర్ల గ్రావెల్ అడ్డగోలుగా తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడు తున్నారు అక్రమార్కులు. మండలంలోని సాంబా యిగూడెం, రామానుజవరం పరిసర ప్రాంతాలు గ్రావెల్ గుట్టలకు పెట్టింది పేరు. ఈ క్రమంలో కొం దరు అక్రమార్కులు సాంబాయిగూడెంలోని పేరం టాలచెరువు సమీపంలోని గుట్టలే లక్ష్యంగా లక్షల క్యూబిక్ మీటర్ల గ్రావెల్‌ను అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. పేరంటాల చెరువుకు చుట్టూ కన్నులవిందు చేస్తున్న గుట్టలు కనుమరు గైన తీరు పలువురిని విస్మయానికి గురి చేస్తోంది. చెరువుకు ఆదరవుగా ఉన్న కొండలు అక్రమార్కుల రవాణాతో బలహీనపడగా ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందో తెలియక సాంబాయిగూడెం గ్రామస్తులు బిక్కుబిక్కు మంటున్నారు.

రెండు కిలోమీటర్ల మేర రోడ్డు

ప్రభుత్వానికి రాయల్టీ చెల్లించి ప్రభుత్వ అనుమతు లతో తీయాల్సిన గ్రావెల్‌ను అడ్డగోలుగా అనుమ తులు లేకుండా మాయం చేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఓ స్థానిక కాంట్రాక్టర్‌తో అగ్రిమెంట్ చేసుకుని లక్షల క్యూబిక్ మీటర్ల గ్రావెల్ తరలిస్తు న్నారని సమాచారం. గ్రావెల్ తరలింపునకు ఏకం గా రెండు కిలోమీటర్లకు పైగా రోడ్డును నిర్మించారం టే అక్కడి పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఎంతో ప్రాచీనమైన చరిత్ర ఉన్న పేరంటాల చెరువును, ప్రకృతి రమణీయతకు అద్దం పట్టే గుట్టలు, చెట్లు సైతం కనుమరుగై కేవలం చెరువుకు చేరాలంటే దారి మాత్రమే మిగిలినా అధికారులు పట్టించుకోక పోవడంపై ఆగ్రహం వ్యక్తమవుతోంది.

యువతి ఆత్మహత్యాయత్నం

మణుగూరుటౌన్: ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎంఎల్‌హెచ్‌పీగా పనిచేస్తున్న యువతి మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన మణుగూ రులో సోమవారం రాత్రి చోటుచేసుకోగా, విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. క్షతగాత్రురాలిని స్థానిక ఆస్పత్రికి.. అక్కడి నుంచి భద్రాచలం, తర్వాత ఖమ్మం తరలించినట్లు సమాచారం.

ఏఎన్‌ఎంలతో వివాదమే కారణమా?

యువతి పనిచేస్తున్న ఆస్పత్రి వర్గాల సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. మణుగూరు మండ లంలోని ముత్యాలమ్మనగర్‌కి చెందిన హిమబిందు శివలింగాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎం ఎల్‌హెచ్‌పీగా విధులు నిర్వహిస్తోంది. కొంతకాలం గా పీహెచ్‌సీలోని ఏఎన్‌ఎంలకు ఎంఎల్‌హెచ్‌పీ హిమబిందుకు తరచూ గొడవలు జరుగుతు న్నాయి. తరచూ తమ విధుల్లో జోక్యం చేసుకుం టూ, కొందరు వ్యక్తులతో ఆర్‌టీఐలు వేయిస్తూ తమపై పెత్తనం చెలాయిస్తోందంటూ ఏఎన్‌ఎంలు స్థానిక వైద్యులకు సమ్మె నోటీసు ఇవ్వడంతో పాటు ఎమ్మెల్యేను కలిసి ఆమెను బదిలీ చేయాలంటూ సమస్య వివరించారు. సమస్య పరిష్కరించాలని డీఎంహెచ్‌ఓకి ఎమ్మెల్యే సిఫార్సు చేశారు. ఈ క్రమంలో హిమబిందు విధులు చేయనంటూ రాజీ నామా పత్రం అందించి, మళ్లీ ఇక్కడే విధులకు హాజరవుతోంది. ఈ క్రమంలో వివాదం తారా స్థాయికి చేరి ఏఎన్‌ఎంలు ఎంఎల్‌హెచ్‌పీపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పూర్తిస్థాయి విచారణ జరిపిన స్థానిక పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిసింది. ఈ క్రమంలోనే సోమవారం విధులకు హాజరైన హిమబిందు మధ్యాహ్నమే అనుమతి తీసుకుని వెళ్లిపోయింది. ఈ క్రమంలోనే సూసైడ్ నోట్ రాసి ఆత్మహత్యాయత్నానికి పాల్ప డినట్లు తెలుస్తోంది. కాగా, యువతి పరిస్థితి నిలక డగా ఉన్నట్లు తెలుస్తోంది.

బిడ్డ బతికి వస్తుందేమోనని..



అశ్వాపురం మండలం మొండికుంటలో ఓ కోతి ఇటీవల బిడ్డకు జన్మనిచ్చింది. అయితే, ఆ బిడ్డ ప్రమాదంలో కన్నుమూ సింది. ఆ విషయాన్ని తల్లి గుర్తించిందో లేదో తెలియదు కానీ బిడ్డను ఒడిలో ఎత్తుకుని ఊరంతా తిరుగుతోంది. బిడ్డ బతికి వస్తుందనే భావనతో తిరుగుతున్న ఆ కోతిని చూసి స్థానికులు భావోద్వేగానికి గురయ్యారు. తల్లి ప్రేమ మనుషులకే కాదు మూగజీవాలకూ ఉంటుందనడానికి ఈ ఘటన నిదర్శనంగా నిలుస్తోంది.

– అశ్వాపురం

పలువురిని బైండోవర్ చేసిన పోలీసులు

అశ్వారావుపేటరూరల్: సంక్రాంతి పండుగ నేపథ్యంలో కోడి పందేలు, పేకాట స్థావరాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని, ముందస్తు చర్యల్లో భాగంగా పలువురిని బైండోవర్ చేశామని ఎస్ఐ టి.యయాతిరాజు తెలిపారు. గత మూడేళ్లలో కోడి పందేలు, పేకాట కేసుల్లో నిందితులుగా ఉన్న 70 మందిని మంగళవారం బైండోవర్ చేసి, కౌన్సెలింగ్ ఇచ్చారు. పండుగ పేరుతో కోడి పం దేలు, పేకాట స్థావరాలు ఏర్పాటు చేసినా, వాటిలో పాల్గొన్నా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో కోడి పందేలు, పేకాట కేం ద్రాలు నిర్వహిస్తే డయల్–100 లేదా 87126 82062 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. అనంతరం 70 మందిని స్థానిక తహసీల్దార్ కృష్ణప్ర సాద్ ఎదుట హాజరు పరిచి, సొంతపూచికత్తుపై విడుదల చేశారు.

దమ్మపేటలో..

దమ్మపేట: గతంలో పేకాట, కోడి పందేలు, ఇతర జూదం ఆడి, నిర్వహించి కేసులపాలైనవారిని పోలీసులు మంగళవారం బైండోవర్ చేశారు. ఎస్ఐ సాయి కిశోర్‌రెడ్డి మాట్లాడుతూ.. రాబోయే సంక్రాంతి పండుగ సందర్భంగా, మండ లంలో ఎలాంటి జూద క్రీడలు నిర్వహించకుండా ముందస్తు చర్యలు తీసుకుం టున్నామని, గత మూడేళ్లుగా పేకాట, కోడి పందేల కేసుల్లో ఉన్న నిందితులు, కోడి కత్తులు తయారీ, కోడి కత్తులు కట్టేవారు 80 మందికి కౌన్సెలింగ్ నిర్వహిం చి, మండల ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ ఎదుట బైండోవర్ చేశామని తెలిపారు.

చెక్ బౌన్స్ కేసులో ఆరు నెలల జైలు

మణుగూరుటౌన్: చెక్ బౌన్స్ కేసులో ఓ వ్యక్తికి ఆరునెలల జైలు శిక్షతోపాటు రూ.3 లక్షల జరి మానా విధిస్తూ న్యాయమూర్తి కంభపు సూరిరెడ్డి మంగళ వారం తీర్పునిచ్చారు. 2020లో మణుగూరు అశోక్‌నగర్ చెందిన కంటకాల నాగవెంకటశ్రీనివాస్ బాయి కూనవరంనకు చెందిన మహ్మద్ ముత్తుజాకు రూ.3 లక్షల రుణం ఇచ్చాడు. అందుకు గాను తీసుకున్న చెక్కును శ్రీనివాస్ బ్యాంకులో జమ చేయగా బౌన్స్ అయ్యింది. దీంతో బాధితుడు కోర్టులో కేసు దాఖలు చేయగా సాక్ష్యాధారాలు పరిశీలించిన మెజిస్ట్రేట్ కంభపు సూరిరెడ్డి మహ్మద్ ముత్తుజాకి రూ.3 లక్షల నష్టపరిహారం విధించడంతో పాటు ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. నెల వ్యవధిలో రూ.3 లక్షల పరిహారం కట్టని పక్షంలో మరో నెల రోజులు అదనంగా జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. ఫిర్యాది తరుపున న్యాయవాదులు రమణారెడ్డి, బద్దం శ్రీనివాసరెడ్డి, గురుకృష్ణ వాదించారు.

బెల్ట్ షాప్‌లో గంజాయి విక్రయం

మణుగూరుటౌన్: మండలంలోని సమితిసింగారంలో బెల్ట్‌షాప్ నిర్వహిస్తూ గంజాయి విక్రయిస్తున్న ఓ మహిళను అదుపులోకి తీసుకుని ఆమె వద్ద నుంచి రెండు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని మంగళవారం పోలీసులు తెలిపారు. సీఐ సతీశ్‌కుమార్ కథనం ప్రకారం.. సమితిసింగారంలోని ఓ బెల్ట్ షాప్‌లో గంజాయి విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు ఎస్ఐ మేడ ప్రసాద్ సిబ్బందితో దాడి చేశారు. నిర్వాహకురాలు స్వరూప నుంచి రెండు కిలోల గం జాయిని స్వాధీనం చేసుకున్నారు. అభి, రమేశ్, వసీం అక్రం, స్వరూప కలిసి వసీం అక్రం ఆటోలో ఒడిశా రాష్ట్రం చిత్రకొండలో తనకు పరిచయం ఉన్న నగేశ్ నుంచి గంజాయిని రూ.5,800లకు కొనుగోలు చేసి విక్రయిస్తున్నట్లు అంగీకరిం చిందని సీఐ చెప్పారు. గంజాయి అమ్మిన నగేశ్ పరారీలో ఉన్నాడని, ముగ్గురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ సతీశ్‌కుమార్ వెల్లడించారు. దాడుల్లో సిబ్బంది షమీం, రవీందర్, కన్నారావు, పీసీ పద్మ ఉన్నారు.

ఆర్థికాభివృద్ధే లక్ష్యం కావాలి..

ఐటీడీఏ పీఓ రాహుల్



గిరిజన మహిళలకు చెక్ అందజేస్తున్న పీఓ రాహుల్

భద్రాచలం: గిరిజన మహిళలు ఆర్థికాభివృద్ధే లక్ష్యం గా సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమల స్థాపనపై దృష్టి సారించాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ సూచిం చారు. ఎంఎస్ఎంఈ పథకం క్రింద సబ్సిడీ ద్వారా రుణాలు పొంది నెలకొల్పిన కొన్ని పరిశ్రమలు ఆగి పోగా, తిరిగి ప్రారంభించేలా మంజూరైన ఆర్థిక సాయాన్ని మంగళవారం ఆయన మహిళలకు అం దజేశారు. ఈ సందర్భంగా భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో జరిగిన సమావేశంలో పీఓ మాట్లా డారు. భద్రాచలంలోని న్యూట్రిమిక్స్ యూనిట్, లక్ష్మీనగరంలోని చిక్కీ యూనిట్, తుమ్మలచెరు వులోని దాల్ మిల్ యూనిట్ నిర్వాహకులకు రూ.5 లక్షల చొప్పున రూ.15 లక్షల సాయం అందిం చామని తెలిపారు. ఈ నిధులతో ముడి సరుకులు కొనుగోలు చేసి మార్కెటింగ్ చేసుకోవడం ద్వారా నగదు తిరిగి ఐటీడీఏకు చెల్లించాలని సూచించారు. ఏపీఓ కరీం, జేడీఎం హరికృష్ణ పాల్గొన్నారు.

టెండర్ ప్రకారం కంప్యూటర్ల సరఫరా

సంక్షేమ శాఖ నిబంధనలు, టెండర్ సమయాన చేసిన సూచనల మేరకు నాణ్యమైన కంప్యూటర్లు సరఫరా చేయాలని ఐటీడీఏ పీఓ రాహుల్ సూచిం చారు. ఆశ్రమ పాఠశాలలకు కంప్యూటర్ల సరఫరా టెండర్ల ప్రక్రియను ఆయన పరిశీలించి మాట్లాడారు. భద్రాద్రి జిల్లాలోని ఇరవై ఆశ్రమ పాఠశాలలకు నిబంధనల మేరకు కంప్యూటర్లు సమకూర్చని పక్షాన ఏజెన్సీల బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ట్రైబల్ వెల్ఫేర్ డీడీ మణెమ్మ, ఏసీ ఎంఓ రమణయ్య, ఏటీడీఓ అశోక్‌కుమార్, జీసీసీ అధికారులు సమ్మయ్య, రమణమూర్తి పాల్గొన్నారు.

సీసీ రహదారులకు దుబ్బ ఇసుక

- నిబంధనలు పాటించని కాంట్రాక్టర్
- పట్టించుకోని అధికారులు



ఏఎస్‌ఆర్‌కాలనీలో సీసీ రహదారి కోసం నిల్వ ఉంచిన దుబ్బ ఇసుక

అశ్వారావుపేట: అశ్వారావుపేటలో ఇసుక దందా జోరుగా సాగుతోంది. రెవెన్యూ, పోలీస్ అధికా రులు ఇసుక అక్రమ రవాణాను పరోక్షంగా ప్రోత్స హిస్తున్నట్లు సమాచారం. వారికి నచ్చిన వారు అయితే ఇసుక ట్రాక్టర్‌కు నామమాత్రపు ఫైన్ విధిం చి వదిలేస్తారు. లేకుంటే కొత్తగూడెం పంపి మరీ చలానా చెల్లించి ట్రాక్టర్ విడిపించుకోవాలని నాలు గైదు రోజులు ముప్పు తిప్పలు పెడతారు. దీంతో ఇసుక అక్రమార్కులు, సీసీ రహదారుల నిర్మాణ కాంట్రాక్టర్లు, పరోక్షంగా పోలీస్, రెవెన్యూ అధికా రులు కుమక్కయినట్లుగా ప్రచారం జరుగుతోంది. అధికారుల అండదండలతో కాంట్రాక్టర్లు దుబ్బ ఇసుకతో సీసీ రహదారులు నిర్మించేందుకు సిద్ధప డ్డారు. ఇటీవల పేరాయిగూడెం పంచాయతీ ఏఎస్ ఆర్ కాలనీలో సీసీ రహదారుల నిర్మాణానికి ఎమ్మెల్యే జారే ఆదినారాయణ భూమిపూజ నిర్వ హించారు. ఈ రహదారి నిర్మాణానికి పేపర్ మిల్లు ఎదురుగా జాతీయ రహదారి వెంట భారీ దుబ్బ ఇసుక నిల్వ చేశారు. కాలనీలో సీసీ రహదారులు నిర్మించడానికి ఈ ఇసుక వాడనున్నట్లు తెలిసింది. సీసీ రహదారులకు గోదావరి ఇసుకకు ప్రభుత్వం బిల్లు చెల్లిస్తుంది. స్థానిక వాగుల నుంచి ఇసుక రవా ణాకు అనుమతులు లేనే లేవు. అయినా దుబ్బ ఇసు కతోనే అన్ని నిర్మాణాలు చేపడుతున్నారు. ఈ విష యాన్ని తహసీల్దార్ కృష్ణప్రసాద్ దృష్టికి తీసుకువెళ్ల గా.. వాగుల నుంచి ఇసుకను రవాణా చేసేందుకు ఎవరికీ అనుమతులు లేవన్నారు. అదీ కాక ప్రభుత్వ పథకాలకు ఇసుకను సమకూర్చాలనే ఎలాంటి ఆదేశాలు లేవని.. గిర్దావర్‌ను పంపి సీజ్ చేయిస్తామన్నారు. పంచాయతీరాజ్ డీఈఈ శ్రీధర్ దృష్టికి తీసుకువెళ్లగా నాణ్యమైన గోదావరి ఇసుకను మాత్రమే సీసీ రహదారులకు వినియోగించాలని.. వాగుల దుబ్బ ఇసుకతో సీసీ రహదారులు నిర్మించ కుండా చర్యలు తీసుకుంటామన్నారు.

తండ్రి మందలించాడని యువకుడి ఆత్మహత్య



మృతదేహాన్ని తరలిస్తున్న దృశ్యం

మణుగూరుటౌన్: ఖాళీగా తిరుగుతున్న కొడుకును తండ్రి మందలించడంతో మనస్తాపంతో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళ వారం మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని సమితిసింగారం పంచాయతీ అశోక్‌నగర్‌కి చెందిన శ్రీశైలం కుమా రుడు తెడ్డు మహేశ్(20) మినరల్ వాటర్ ప్లాంట్‌లో ఆటోడ్రైవర్‌గా పనిచేసి, మానేశాడు. ఖాళీగా తిరు గుతూ మద్యానికి బానిసయ్యాడు. సోమవారం రాత్రి తండ్రి ఆలస్యంగా ఇంటికి వచ్చిన కొడుకుని మందలించి సెల్‌ఫోన్ ఎక్కడుందంటూ ప్రశ్నిం చాడు. దీంతో మనస్తాపానికి గురైన మహేశ్ స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలోని చెట్టుకు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు చూసి పోలీసులకు సమాచారం అందించగా, మృ తుడి బంధువుల నుంచి ఎస్ఐ మేడ ప్రసాద్ వివ రాలు సేకరించి పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వివాహిత..

బూర్గంపాడు: ప్రైవేట్ ఫైనాన్స్ కిస్తీలు చెల్లించలేని స్థితిలో నాగినేనిప్రోలు రెడ్డిపాలెం గ్రామానికి చెం దిన ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామంలోని ఎస్సీకాలనీకి చెం దిన చెక్కా రజిత (36), భర్త రాఘవ వ్యవసాయ కూలీలుగా జీవనం సాగిస్తున్నారు. దంపతులకు ఇద్దరు పిల్లలున్నారు. కుటుంబ పోషణకు మైక్రో ఫైనాన్స్‌ల వద్ద అప్పు తీసుకున్నారు. వాయిదాలు చెల్లించేందుకు ఆర్థికంగా ఇబ్బందులు పడుతు న్నారు. కాగా, తీవ్ర మనస్తాపానికి గురైన రజిత మంగళవారం తెల్లవారుజామున ఇంట్లో ఉరివే సుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి సోదరుడు శంకర్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ రాజేశ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.